క్లుప్తంగా

25న ఆదిత్యాలయ పాలకమండలి సమావేశం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ పాలకమండలి సభ్యుల సర్వసభ్య సమావేశం ఈ నెల 25న ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నామని ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఇప్పిలి జోగి సన్యాసిరావు, ఎక్స్ అఫీషియో మెంబర్ ఇప్పిలి శంకరశర్మల సమక్షంలో జరగనున్న ఈ సమావేశంలో ఆలయ అభివృద్ధి పనులపై సమీక్షించడంతో పాటు పలు తీర్మానాలు చేపట్టనున్నామని ఈవో వివరించారు.

భవన నిర్మాణాలు వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ మూర్తి

లావేరు: భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఈ వీఎస్ఎస్ మూర్తి అన్నారు. లావేరు మండల పరిషత్ కార్యాలయంలో భవన నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, నిర్మాణదారులుతో సమీక్ష నిర్వహించారు. సచివాలయాలు, రైతు భరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్, పాలకేంద్రాలకు మంజూరైన భవనాల ప్రగతిపై చర్చించారు. సమావేశంలో పీఆర్ మండల ఏఈ లింగాల అప్పన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముగిసిన వీఆర్ఏల దీక్షలు



దీక్షలో పాల్గొన్న వీఆర్ఏలు

గార: వీఆర్ఏల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పలువురు వీఆర్ఏలు మండల కేంద్రం గారలో రెండు రోజులుగా చేపట్టిన దీక్షలు శుక్రవారంతో ముగిశాయి. పేస్కేల్ అమలు చేయాలని, వీఆర్ఏలను వీఆర్‌డబ్ల్యూలుగా గుర్తించాలని, వాచ్‌మేన్లు, డ్రైవర్లు, వీఆర్ఓలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామారావు, రాజశేఖర్, నాయుడు, సంతు తదితరులు పాల్గొన్నారు.

మలిపెద్ది కీర్తికి డాక్టరేట్



ఏయూ వీసీ ప్రసాద్ రెడ్డి నుంచి పీహెచ్‌డీ పట్టా స్వీకరిస్తున్న కీర్తి

ఎచ్చెర్ల క్యాంపస్ : శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఫార్మసీ లెక్చరర్ మలిపెద్ది కీర్తి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.వి.జి.డి. ప్రసాద రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం పట్టా అందుకున్నారు. కళాశాల అధ్యాపకులు అభినందించారు.

బాల్య వివాహాలు నేరం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ ఎల్.వెంకటరావు

శ్రీకాకుళం క్రైమ్ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, చదువుకునే వయసులో బాలలు పనులకు వెళ్లకూడదని.. దుకాణాల వారు పనుల్లో పెట్టుకోకూడదని ఏహెచ్‌టీయూ(యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్-మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం) ఎస్ఐ ఎల్.వెంకటరావు అన్నారు. ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు మండల వీధిలోని గ్లోబల్ హైస్కూల్లో విద్యార్థులకు ఐసీడీఎస్ విభాగంతో కలిసి బాల్య వివాహాలు, బాలల దుర్వినియోగం, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ కో-ఆర్డినేటర్ గీత, దిశా పోలీస్ కానిస్టేబుల్ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



సభ్యత్వం తీసుకుంటున్న కేజీబీవీ ఉపాధ్యాయులు

జి.సిగడాం : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా జిల్లాలో సుమారు 10 వేల మందితో సభ్యత్వం లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, మండల శాఖ అధ్యక్షుడు కాయల రమేష్, కిల్లారి వెంకటరమణ అన్నారు. శుక్రవారం మెట్టవలస, మర్రివలస, నాగులవలస, సీతంపేట, నక్కపేట, పాలఖండ్యాం, టిడివలస, వీఆర్‌పేట, జి.సిగడాం, వెంకయ్యపేట, ఎందువ, మోడల్ పాఠశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ సభ్యులు చీర రాము, దుంగ వీరయ్య, పిట్టా అప్పారావు, పాసపు సత్యారావు, పప్పల తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు..
పవర్ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బ

- చల్లపేట సబ్‌స్టేషన్‌లో కాలిపోయిన పీటీఆర్
- విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం
- శ్రీకూర్మం దేవస్థానంతో పాటు ఏడు పంచాయతీల్లో లోవోల్టేజి సరఫరా
- మరో 10 రోజుల పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు బ్రేక్..?



ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా పనులను పర్యవేక్షిస్తున్న ఈఈ బయ్యన్నాయుడు, సిబ్బంది

అరసవల్లి/గార:

గార మండలం చల్లపేట 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో కీలకమైన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ (పీటీఆర్) కాలిపోవడంతో గురువారం అర్ధరాత్రి నుంచే సుమారు 50 గ్రామాల ప్రజలకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో ఈ 5 ఎంవీఏ (మెగా ఓల్ట్ యాంపియర్) పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయక విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వెంటనే టీఆర్ఈ విభాగం ఏడీఈ చల్లా వెంకటేశ్వరరావు బృందం తనిఖీ చేసి పీటీఆర్ కాలిపోయినట్లు నిర్ధారించారు. ఈ ప్రభావంతో సమీప ప్రాంతాల్లోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు, వాణిజ్య, వ్యాపార సంస్థలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో హుటాహుటిన శ్రీకాకుళం ఆపరేషన్స్ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు, టౌన్ డిప్యూటీ ఈఈ బగ్గు రాంబాబు, గార ఏఈ ఎల్.పవన్‌మూర్తిల బృందం శుక్రవారం వేకువజాము 4 గంటలకే చల్లపేట సబ్‌స్టేషన్‌కు చేరుకుని పరిస్థితులను సమీక్షించారు. ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ ఆదేశాల మేరకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరాకు చర్యలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో కొత్తూరు సైరిగాం, ఆమదాలపాడు 11 కేవీ ఫీడర్ల నుంచి బ్యాక్ ఫీడింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. ఈఈ పర్యవేక్షణలో పనులు పూర్తి చేయడంతో శుక్రవారం సాయంత్రానికి సమీప గ్రామాల్లో సింగిల్ ఫేజ్ డొమెస్టిక్ (గృహావసరాలు) విద్యుత్ సరఫరా ఇవ్వగలిగారు.

త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు బ్రేక్..!

పీటీఆర్ కాలిపోవడంతో శ్రీకూర్మం దేవస్థానం (24 గంటల విద్యుత్ లైన్)కు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అంపోలు, శ్రీకూర్మం, రామచంద్రాపురం, వాడాడ, కొత్తూరు సైరిగాం, సతివాడతో పాటు శ్రీకాకుళం మండలానికి చెందిన వప్పంగి పంచాయతీల్లో ఉన్న 50 గ్రామాల్లో సుమారు 19 వేల విద్యుత్ కనెక్షన్లకు సరఫరా ఆగిపోయింది. ఈ ప్రాంతాల పరిధిలో 800 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లతో పాటు సుమారు 40 రైస్‌మిల్లులు, నాలుగు పెట్రోల్ బంకులు తదితర త్రీ ఫేజ్ కనెక్షన్లకు మాత్రం విద్యుత్ సరఫరా ప్రస్తుతానికి నిలిచిపోయినట్లే. మళ్లీ కొత్తగా ఇదే సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తేనే వీటిని పూర్తి స్థాయిలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా జరుగుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.



చల్లపేట సబ్‌స్టేషన్‌లో కాలిపోయిన 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్

8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు అత్యవసరం:

చల్లపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఇటీవల పారిశ్రామికంగా, వాణిజ్య వ్యాపార విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. ఈ సబ్‌స్టేషన్‌లో ప్రస్తుతానికి 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ వినియోగించడంతో అధిక సామర్థ్యపు లోడు దీనిపై పడింది. అందుకే పీటీఆర్ కాలిపోయినట్లు ఇంజినీర్లు ధ్రువీకరిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక వినియోగదారులు కోరుతున్నారు. తాజా సమస్యతో కొద్దిరోజుల పాటు విద్యుత్ సరఫరా ఈప్రాంతాలకు పూర్తిస్థాయిలో ఉండవు. సింగిల్ ఫేజ్ కరెంట్ మాత్రమే వినియోగంలో ఉంటూ.. లోవోల్టేజి కూడా కొన్ని గ్రామాల్లో మరో పది పదిహేను రోజుల పాటు కొనసాగే అవకాశముంది. ఈ మేరకు సమీప ఏడు పంచాయతీల్లో త్రీఫేజ్ వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని గార మండల విద్యుత్ ఇంజినీర్ పవన్‌మూర్తి సూచిస్తున్నారు.

అర్హులందరికీ జగనన్న సంక్షేమ ఫలాలు



మరువాడలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంతా జగనన్న సంక్షేమ ఫలాలు అందుతాయని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మరువాడ గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలతో పాటు ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. గతంలో రేషన్ కార్డు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. మేలు చేసే ప్రభుత్వానికి ఎప్పటికి మరిచిపోరాదని, సీఎం జగనన్న పేదల పక్షపాతి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, గురాన మానస, రెడ్డి విశ్వేశ్వరరావు, ఎన్‌జీఆర్‌పురం, మరువాడ సర్పంచులు మైలపల్లి పైడమ్మ, జక్కంపూడి అచ్చిబాబు, ఎంపీటీసీ ఉప్పాడ అప్పన్న, గ్రామ నాయకులు జక్కంపూడి బంగ్రారాజు, పిల్ల తాత తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

శ్రీకాకుళం క్రైమ్: బర్త్‌డే పార్టీకొచ్చి పేకాట ఆడుతూ పోలీసులకు 13 మంది జూదరులు పట్టుబడిన సంఘటన నగరంలోని ఓ హోటల్లో జరిగింది. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ నాగిరెడ్డి లక్ష్మణరావు తెలిపిన వివరాల మేరకు.. ఓ వ్యక్తి బర్త్‌డే పార్టీకి ఆహ్వానించడంతో విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తు లు ఓ హోటల్లో దిగి పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే దాడులు చేయగా వారి వద్ద నుంచి రూ. 1,33,800 నగదు, 11సెల్‌ఫోన్లు స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

భక్తిశ్రద్ధలతో హోమం



శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న గురు రాఘవేంద్రస్వామి మఠంలో శుక్రవారం లోకకల్యాణార్థం పవమాన హోమం నిర్వహించారు. ఉత్తరాది మఠం సుధాపండితులు, విజయసింహాచార్యులు, రఘోత్తమాచార్యులు, మద్దల బాబు నేతృత్వంలో గణపతి పూజ, నవగ్రహారాధన, కలశారాధన, పవమాన మంత్రాలతో హవనం చేశారు. ఈ సందర్భంగా అర్చకులు బాబు మాట్లాడుతూ అధిక శ్రావణమాసం సందర్భంగా ఈ హోమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మొసలికంటి వెంకట వేణుగోపాలాచార్యులు, జమ్మి వెంకటేశ్వరరావు, కడపా సురేష్, రామారావు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా నిలవాలి



మాట్లాడుతున్న జిల్లా శాశ్వత లోక్ అదాలత్ న్యాయమూర్తి జ్ఞాన సువర్ణరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకుని ఉత్తమ పౌరులుగా నిలవాలని జిల్లా శాశ్వత లోక్ అదాలత్ న్యాయమూర్తి జి.జ్ఞానసువర్ణరాజు అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రజాప్రయోజన సేవల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవలో ఎటువంటి సందేహం ఉన్నా శాశ్వత లోక్ అదాలత్‌కు సమాచారం ఇవ్వవచ్చన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న శాశ్వత లోక్ అదాలత్ కోర్టులో కేసు వేసేందుకు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకరానారాయణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బీఎల్ఓలతో మాట్లాడుతున్న ఆర్‌డీఓ శాంతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి బి.శాంతి శుక్రవారం పరిశీలించారు. హడ్కో కాలనీ, హెచ్‌బీ కాలని, బాదుర్లపేటలో పీఎస్‌లను సందర్శించి ఓటరు సర్వే సరళిని పరిశీలించారు. బీఎల్ఓలకు పలు సూచనలందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరావు పాల్గొన్నారు.

ఇంటింటా ఓటర్ సర్వే

రణస్థలం: మండలంలో ఇంటింటా ఓటర్ సర్వే పకడ్బందీగా నిర్వహిస్తామని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జి.కె.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని 87 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటా ఓటర్ సర్వే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్ఓల ద్వారా పార్టీల బూత్ ఏజెంట్ల సమక్షంలో సర్వే చేస్తున్నామని చెప్పారు.

ఓటరు సర్వేకు సహకరించాలి

గార : ప్రతి ఇంటింటికీ వెళ్లి పక్కాగా ఓట్లు పరిశీలిస్తామని, అందుకు రాజకీయ పక్షాలు సహకరించాలని తహశీల్దార్ జెన్ని రామారావు అన్నారు. శుక్రవారం నుంచి నెల రోజుల పాటు వీఆర్‌వోలు, బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్లతో మాట్లాడి జాబితా పరిశీలన చేస్తామన్నారు. శ్రీకూర్మం పంచాయతీలో ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. రామచంద్రాపురంలో రెవెన్యూ పరిశీలకుడు అనిల్, సర్పంచ్ జి.వి.రమణమూర్తి, ఎంపీటీసీ రుప్ప శ్రీనివాసరావు, వీఆర్‌వో చక్రవర్తి, సెక్రటరీ ఎం.రాములు ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేశారు. కార్యక్రమంలో అంబటి చినబాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

చెత్త సంపద కేంద్రం పరిశీలన

శ్రీకాకుళం రూరల్: వాకలవలసలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ శుక్రవారం పరిశీలించారు. సంపద కేంద్రాన్ని తక్షణమే మెరుగు పర్చాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ బగాది మనోజ్‌కుమార్, డీఎల్‌పీఓ గోపిబాల, ఈఓపీఆర్‌డీ ప్రకాశ్‌రావు, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి తిరుమలాదేవి పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. ఫరీదుపేటలో శనివారం ప్రారంభం కానున్న గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహణపై సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. సమావేశంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు మాడుగుల మురళీధర్‌బాబా, సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు, నాయకులు నేతింటి సత్యనారాయణ పాల్గొన్నారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి

జి.సిగడాం: ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని మండల పరిషత్ ప్రత్యేకాధికారి బి.వి.ప్రసాదరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నిశ్చల, ఎస్ఐ సామంతుల రామారావు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో త్రిపురసుందరి దేవి

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి నదీ తీరాన ఉన్న బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు జరిగాయి.

నేడు వప్పంగిలో జగనన్న సురక్ష

శ్రీకాకుళం రూరల్: మండలంలోని ఒప్పంగి, సానివాడ గ్రామాల్లో శనివారం ఉదయం 10 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం ఎంపీడీఓ రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు.

ట్రేడ్ లైసెన్స్ పొందనివారిపై చర్యలు



శ్రీకాకుళం క్రైమ్ : మున్సిపాలిటీ పరిధిలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వ్యాపారులు తప్పనిసరిగా అధికారుల నుంచి ట్రేడ్ లైసెన్సు పొందాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని శ్రీకాకుళం నిఘా, అమలు విభాగం అధికారి (ఎస్పీ) ఎ.సురేష్‌బాబు అన్నారు. పెరిగిన పప్పు దినుసుల ధరల నియంత్రణలో భాగంగా శుక్రవారం శ్రీకాకుళం, నరసన్నపేట పట్టణాల్లోని పలు దుకాణాల్లో విజిలెన్సు డీఎస్పీ కిరణ్‌కుమార్, సిబ్బంది, సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. నిల్వలపై ఆరా తీశారు. తనిఖీల్లో సివిల్ సప్లయ్ ఆర్ఐ కళ్యాణ్‌దేవ్, విజిలెన్సు సీఐ సింహాచలం, ఎస్ఐ అశోక్‌కుమార్, ఏఈలు రవికిషోర్, గణేష్ పాల్గొన్నారు.

వలంటీర్ల కృషితో ప్రజలకు చేరువగా పథకాలు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజలంతా కావాలని కోరుకుంటున్న వలంటీర్ వ్యవస్థను తొలగించాలని విపక్షాలు కోరడం భావ్యం కాదని, వలంటీర్లతోనే శతశాతం సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు చేరువవుతున్నాయని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో ఫాజుల్‌బాగ్ పేటలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 300 మందికి పైగా ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాల విషప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. వలంటీర్లు కన్నబిడ్డల్లా తమకు అప్పగించిన ప్రతి పనినీ చేస్తూ సంబంధిత లబ్ధిదారుల మన్ననలు అందుకుంటున్నారని ప్రశంసించారు. కరోనా వేళ ప్రతి కుటుంబానికి తొమ్మిది సార్లు నిత్యావసర సరకులు అందించారని గుర్తు చేశారు. ఎక్కడ ఒక్క కేసు నమోదైనా తమ పరిధిలో ఉన్న వైద్య బృందానికి సమాచారం చేరవేసి నిరంతరం సైనికుల్లా విధులు నిర్వర్తించారని కొనియాడారు. వీటిని మరిచిపోయి మాట్లాడటం తగదన్నారు. సంక్షేమ పథకాల అమలుకు ముందుగానే క్యాలెండర్ విడుదల చేసి అమలు చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే నేడు నేతన్న నేస్తం పేరిట రూ.24000 అందించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, అరుణ్ గుప్తా, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, బచ్చు శ్రీనివాసరెడ్డి, ఉట్ల శ్రీను, బరాటం సంతోష్, సీపాన రామారావు, కె.తేజ తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాల పెంపుదలకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రతి రోజూ గడగడపకు వెళ్తున్నామంటే ఓట్ల కోసం, సీట్ల కోసం కాదని, మీ సేవకుడిగా ఏం చేశామో, ఏం చేయాలో తెలుసుకునేందుకు వచ్చామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో న్యూకాలనీలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులతో మమేకమై స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సంబంధించి నగర కార్పొరేషన్ అధికారులకు అక్కడికక్కడే పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎం.వి.పద్మావతి, సాధు వైకుంఠరావు, మండవిల్లి రవి, చల్లా శ్రీనివాస్, అలివేలుమంగ, శిమ్మ రాజశేఖర్, పొన్నాడ రుషి, డాక్టర్ పైడి మహేశ్వరరావు, లుకలాపు గోవిందరావు, గద్దిబోయిన కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి



కొవ్వాడలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండలం కొవ్వాడ మత్స్యలేశం గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మత్స్యకార భరోసా రూ. 4వేలు ఉంటే జగనన్న ప్రభుత్వం వచ్చాక రూ.10 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. డీజిల్ సబ్సిడీ గతంలో 6 శాతం ఉంటే ప్రస్తుతం 9 శాతం అందిస్తున్నట్లు చెప్పారు. రాయితీపై ఫైబర్ బోట్లు అందిస్తున్నామని, మత్స్యవేట పరిరక్షణ కోసం ఫిష్ ఆంధ్రా మార్కెట్లు నెలకొల్పి ఎంతో మంది మత్స్యకార కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నామని వివరించారు. అనంతరం పలు సమస్యలను స్థానికులు విన్నవించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డీడీ పి.వి.శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ టొంపల సీతారాం, మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, రెడ్డి విశ్వేశ్వరరావు, బడి రాంబాబు, మహిళ అధ్యక్షురాలు గురాన మానస, నాయకులు అల్లిపల్లి రాముడు, మైలపల్లి పట్టయ్య, జగ్గులు, గురువులు, అల్లిపల్లి సత్తిరాజు, మల్లిబాబు, నాగేంద్ర, సూరాడ అప్పన్న, బర్రి పైడితల్లి, దుమ్ము శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: కౌమారదశలో ఉన్న బాలికలు ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం నగరంలోని హయాతీనగరంలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే ఏపీ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కౌమారదశ-మానసిక మార్పులు, రుతుస్రావం, సెల్ఫ్ డిఫెన్స్(ఆత్మరక్షణ)అనే అంశంపై పాఠశాలలోని బాలికలకు శుక్రవారం అవగాహన కల్పించారు. 'స్వేచ్ఛ' పేరిట మౌనాన్ని వీడాలని పిలుపునిస్తూ.. రుతుస్రావ సంబంధిత ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఎల్ఈడీ స్క్రీన్‌పై డెమో ద్వారా వివరించారు. ఆరోగ్య సమస్యలు ఉంటే నిర్లక్ష్య చేయరాదన్నారు.కార్యక్రమంలో పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

సానుకూల దృక్పథంతో మెలగాలి



మాట్లాడుతున్న ఎం.నరసింహమూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు సానుకూల దృక్పథంతో ముందుకు సాగితే మంచి భవిష్యత్తు ఉంటుందని ఉపనిషన్మందిరం ఉపాధ్యక్షుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎం.నరసింహమూర్తి అన్నారు. కేశవరావుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యాలతో ముందుకు సాగే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. నైతిక విలువలు, వ్యక్తిగత క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, దేశ భక్తి, పెద్దలను గౌరవించటం వంటివి పాఠశాల స్థాయిలోనే అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ఎయిర్ లైన్స్ రిటైర్డ్ కెప్టెన్ ఈశ్వరరావు, హెచ్‌ఎం సీహెచ్.భారతి, సర్పంచ్ పైడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

